


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



-90-

## బలి పశువు

"రెండేళ్ళ నుండీ కరువుతో దిక్కు తెలియడం లేదమ్మీ. వర్షాలు పడక, పంటలు పండక, నేలంతా ఎండిపోయి బంగారంలాంటి చేను బీడుగా మారింది చూడు. ఇప్పటికే కోమటోళ్ళ రామయ్య దగ్గిర నాలుగు లచ్చల అప్పు చేసినాను. అసలు కన్నా ఎక్కువగా వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఎలా కట్టాలి? మీ మామకేమో ఉబ్బసం రోగం. ఈ ముండాకొడుకు తాగి, ఆడోళ్ళ దగ్గరికి తిరిగి రోగాలన్నీ తెచ్చుకొని నన్ను ఏడిపిస్తున్నాడు. చేసుకున్న పాపానికి రాత్రింబగళ్ళూ వాడికి చెయ్యలేక ఎత్తిపొయ్యలేక నేను చచ్చిపోతున్నాను.

వద్దు నాయనా.. ఆ కర్రోడ్ని నేను చేసుకోను అని వారం రోజులు కూడు తినకుండా ఏడ్చినాను. చిన్నపిల్లను అప్పటికి పైటేసుకునే వయసు గూడా నాకు రాలేదు. మా నాయన నా మాట వినకుండా 'నల్లగా వుంటే ఏమమ్మే? చినబ్బకు నాలుగు కుంటలు భూమి వుండాది. మీరు లక్షణంగా సేద్యం చేసుకోవచ్చు. కూటికి గుడ్డకు తక్కువ వుండదు అని చెప్పి తులం బంగారు పెట్టి రెండు చీరలు కొనిచ్చి రాముడి గుళ్ళో పెళ్ళి చేసినాడు.

పెళ్ళయినకాడ్నించీ ఒక్కరోజు కూడా ఈ ప్రాణానికి సుఖం లేదు. వాడు తాగి తందనాలాడతా వుంటే ఒక పక్క పిల్లోళ్ళను కంటానే మరొకపక్క మగోడి మాదిరి సేద్యం చేస్తిని. సంవత్సరం తిరక్కముందే ముక్కులోకి ముక్కు పుడక కూడా లేకుండా మా నాయన ఇచ్చిన తులం బంగారూ అమ్ముకోని తాగేసినాడు ఈ మొగోడు.

నా రెక్కల కష్టంతోనే పిల్లోళ్ళను సాకి సంతరించినాను. లచ్చ రూపాయల కట్నమిచ్చి పెద్దపిల్లయిన నెలకే కూతురికి పెళ్ళి చేసి బరువు దింపుకున్నాను.

కొడుకును బాగా సదివిద్దామనుకుంటే వాడు పది పెయిల్ అయ్యి కోయేటికి పోతా అనె. నాలుగేళ్ళు చూసినా వీసా రాకపోయె. కొయేటులో మగోళ్ళకు వీజా దొరకడం కష్టమంట. వయసొచ్చిన పిల్లోడు తండ్రి మాదిరి ఊళ్ళో తిరిగి ఎక్కడ చెడిపోతాడోనని భయపడి సంబంధాలు వెతికితే ఐదు లచ్చలు కట్నం ఇస్తామని చాలా సంబంధాలు

వచ్చినాయి. కానీ పిల్ల బావుండాలి కదా. ఆఖరికి.. అయిన పిల్ల, తెల్లగా వుండాది, ముక్కూ మొహం బావుండాది, కట్నం ఇయ్యకపోయినా పోనీలే అని చెప్పి నిన్ను చేసుకుంటిమి.

కాపరానికొచ్చిన కొత్త కోడలివి. నా కడుపులోని దుగద, నా బాధలన్నీ నీకు తెలియాలనే ఇదంతా చెప్తా వుండాను. ఇంటి గురించి నువ్వు తెలుసుకోవాల. నేను పడిన అగచాట్లు నువ్వు పడకూడదనే నీకు చెప్తున్నాను."

"పైర్లు పండే రోజులు రైతులు మూడు పూటలా తినే రోజులూ పోయినాయి. రైతులందరూ వుండే చేలను కూట్నీళ్ళకు అమ్ముకోని తట్టా బుట్టా సర్దుకోని టౌన్ కు పోతా వుండారు. మనం అలా కాకూడదు. నా ప్రాణం వున్నంత వరకూ చేను అమ్మేదానికి లేదు. తరవాత మీ ఇష్టం. ఇప్పుడు ఆ కోమటోడు దుడ్డు కడతారా లేదా అని గొంతుమీద కూర్చున్నాడు.మొన్న బజార్లో నిలేసి అందరి ముందూ అడిగేసరికి సిగ్గుతో తలెత్తుకోలేక పోయినాను. చెంగన్న బావిలో దూకి చస్తే పోతాది అనిపించింది.

అప్పులోకి చేను రాపించుకోవాలని వాడికి దుర్బుద్ధి పుట్టింది. అందుకే వాడు నడి వీధిలో జనాల్లో తెగేసి అడిగేదానికి తెగించినాడు. ఈ గండం గడిచేది ఎట్లా అని నేను నిద్రపోకుండా ఆలోచన చేస్తా వుండాను. నువ్వు తెలివైనదానివి. అంతో ఇంతో ఎనిమిదో తరగతి దాకా సదువుకున్నావు. నువ్వే ఏదో ఒక ఆలోచన చెప్పు సుజాతా. ఈ కష్టాలనుండి మనం తప్పించుకునే మార్గం చెప్పు" సుదీర్ఘమైన తన మాటల్ని ఆపి కోడలి ముఖంలోకి దీనంగా చూసింది బుజ్జమ్మ.

ముడతలు పడిన ఆమె ముఖంలో దిగులు మేఘం దోబూచులాడుతోంది. ఎండిన చేను వైపు ఒకసారి చెమ్మగిల్లిన అత్త కళ్ళ వైపు మరొకసారి సాలోచనగా చూసింది సుజాత.

కరువు రాక్షసి కోరలనుండి తప్పించుకోలేక, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు రైతులు. పేపర్లో వార్తలు చదివి ఇలాంటి విషయాలు తెలుసుకుంటూనే వుంది సుజాత. ఆమె హృదయం ద్రవించింది.

గొంతుకు అడ్డుపడిన దు:ఖాన్ని దిగమ్రింగి నోరు పెగుల్చుకుని "ఏదో ఒకటి ఆలోచిద్దాం అత్తా. సమస్యకు పరిష్కారం వుంటాది. నువ్వు బాధ పడకు" అంటూ ఓదార్చింది.

"నీమీదే నమ్మకం పెట్టుకోని వున్నాను సుజాతా. నువ్వే ఏదో ఒకటి చేసి సంసారాన్ని గట్టెక్కించాల" అనింది బుజ్జమ్మ నేల చూపులు చూస్తూ.

ఆ మాటల్లో ఏవో అర్థాలు స్ఫురించాయి సుజాతకు. ఏదో ఆలోచన బుర్రలో తళుక్కున మెరిసింది. కొంచెం తటపటాయించి "అత్తా మరి ఆయనకు వీజా రావడం కష్టమయితే ముందుగా నేను కొయేటికి పోతాను. ఆడోళ్ళకు వీజా తొందరగా వస్తాదంట కదా. తరవాత ఆయనకు వీజా పంపించి అక్కడికి పిలుచుకుంటా" అనింది సుజాత.

కోడలి మాట వినగానే బుజ్జమ్మ కళ్ళు మెరిసాయి. మొహం బొప్పాయి ఆకులా విప్పారింది.

నవ్వు పెదాలపైకి పొక్కుంటూ వచ్చింది. "నా మనసులో మాట సక్కగా తెలుసుకున్నావు అమ్మీ. నాలుగు లచ్చలు అప్పు దీర్చాలంటే అయ్యే పని కాదు. వున్న చేను వాడి చేతిలో పెట్టాలంటే మనసు ఒప్పదు.
ఇప్పుడు నువ్వే మాకు దిక్కు. ఇంటిని, చేనును కాపాడాల్సింది నువ్వే" అంటూ చేతులు పట్టుకుని కన్నీళ్ళు పెట్టుకునింది బుజ్జమ్మ.

సుజాత హుషారైన పిల్ల. ఏదైనా అందిస్తే అల్లుకుపోగలదు. అత్తా కోడళ్ళిద్దరూ కూడబలుక్కుని పాస్పోర్టు తయారు చేయించారు. ఏజెంటును పట్టుకోని తొందరగా వీజా తెప్పించమని అడిగారు. ఏజెంట్ల పనే అది కదా. తన ఎక్సరే కళ్ళతో సుజాత వైపు చురుగ్గా చూసాడు వాడు. ఇబ్బందిగా అనిపించి పైట సర్దుకుంది సుజాత.
"ఓమ్మా బుజ్జమ్మా..రెండు నెలల్లో ఆయమ్మిని కొయేటికి పంపించే బాధ్యత నాది. మొత్తం అంతా లచ్చ రూపాయలవుతాది. ఇంత దుడ్డు మీరు పెట్టుకోగలరా" అడిగాడు వంకరగా నవ్వుతూ.
"ఆయమ్మి వంటిమీద రెండు తులాల బంగారుండాది సామీ. అది అమ్మితే యాభై యేలయినా వస్తాయో రావో. మిగతాది ఏదో ఒకటి చేసి నువ్వే సర్దుబాటు చెయ్యి. నీ ఋణం వుంచుకోము" బ్రతిమలాడింది బుజ్జమ్మ.
"సరేలే చూద్దాం. ముందు వీజా తెప్పిస్తాను. తరవాత మెడికల్ కు పోవాలి. టిక్కట్లు కొనాలి. ఖర్చయితే చాలా అవుతాది.  భయపడగాకండి. నేను చూసుకుంటా" అన్నాడు ఏజెంట్ హరి.
ఎందుకో వళ్ళంతా పారాడే వాడి చూపులు, మాటలు కంపరం కలిగించాయి సుజాతకు. అయినా తప్పదు అనుకుంటూ ఇంటికి వచ్చారిద్దరూ.వీజా వచ్చిందాకా కొడుక్కి చెప్పకూడదని నిర్ణయించుకున్నారు.

నెల తిరక్కముందే వీజా వచ్చేసింది. మెడికల్ కు మద్రాస్ పోవాలన్నాడు ఏజెంట్ హరి. కొడుక్కి ఏమి చెప్పాలో అర్థం కాలేదు బుజ్జమ్మకు. ఇంతదాకా వచ్చాక ఇప్పుడు వాడు కాదంటే ఏం చెయ్యాల. అందుకే ఇంకా కొన్ని రోజులు రహస్యంగానే వుంచుదామని అనుకున్నారు.
"ఆయమ్మికి ఆరోగ్యం బాగలేదు. తిరపతికి పోయి చూపించుకోని వస్తాము" అని కొడుకు శివకు చెప్పి అత్తా కోడళ్ళిద్దరూ బయల్దేరారు.
శివకు అప్పటికి అనుమానం రాలేదు. ఏజెంట్ హరి బస్ లో సుజాత పక్కనే కూర్చున్నాడు. అత్తాకోడళ్ళిద్దరికీ ఏదో అర్థమయీ కానట్లుండాది.
ఏది అడ్డు చెప్పినా పని ఆగిపోతాదనే భయంతో ఏజెంట్ చెప్పినట్లే చేస్తున్నారు. మొగుడు కూర్చున్నట్లే ధీమాగా పక్కన అనుకుని కూర్చుని మీదకి వంగి మాట్లాడుతున్నాడు హరి. సుజాతకు కంపరంగా వుంది. అయినా కూడా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో జవాబిస్తోంది.

అంతటితో ఆగడు కదా వాడు. ఆగితే (మృ)మగాడెందుకవుతాడు. మద్రాస్ చేరుకున్నారు. మెడికల్ అయింది. అన్ని రిపోర్ట్స్ చక్కగా వచ్చాయి. హోటల్లో అన్నం తిన్నారు.

"రాత్రికి ఇంటికి పోకుండా ఇక్కడే వుండి సముద్రం, బీచ్ చూసి పోదాం" అన్నాడు హరి.

"వద్దులే నాయనా మా కొడుకు ఎదురు చూస్తుంటాడు" అంది బుజ్జమ్మ.

మళ్ళా కొయేటికి పోతే సుజాత దొరకదనే కక్కుర్తి వాడిది.

"నీ జన్మలో ఎప్పుడైనా మద్రాసు చూసినావా బుజ్జమ్మా. సినిమా వాళ్ళంతా వుండే ఊరిది. చచ్చిపోతే ఏమి చూస్తావు. బతికి వుండగానే కళ్ళతో మంచీ చెడ్డా చూడాలి. ఒక్కరోజు వుంటే అక్కడ ఊళ్ళో కొంపలేమీ మునిగిపోవులే" అన్నాడు గదమాయిస్తూ.

ఇక తప్పదన్నట్లుగా మౌనంగా వుండిపోయారు అత్త కోడళ్ళు. అందమైన సముద్రాన్ని చూస్తున్నా మనసంతా కలవరంగానే వుంది సుజాతకు. ఎగిసిపడే అలల్లాగే కల్లోలంగా వుంది మనసు. ఏదో జరుగుతుందనిపిస్తోంది. జరిగితే ఎలా. ఏం చెయ్యాలి అనే ప్రశ్న సముద్రమంత పెద్దదై వేధిస్తోంది. హరి పక్కకు వచ్చి చనువుగా భుజం మీద చెయ్యి వేసాడు. చుట్టూ చీకటి కమ్ముకుంటోంది.  అంతటితో ఆగలేదతడు. సుజాత ముడుచుకుపోతోంది. బీచ్ లోని ఇసుకలోకి కూరుకుపోతే బావుండును అనుకుంటోంది.

ఏజెంట్ హరి ఇలా ఎందరి ఆడవాళ్ళను వేధించాడో. అవసరం, అక్కర ఎంతమందిని లొంగేలా చేసిందో. దేవుడికే ఎరుక. అసహనంగా కదిలింది సుజాత

లొంగక చస్తాదా. కొయేటికి పోవాలంటే తప్పదు మరి. ఇలాంటి ఆడోళ్ళను ఎంతమందిని చూడలేదు అనుకుంటూ గర్వంగా నవ్వుకున్నాడు హరి.

మనసులో రాత్రికి ఏం చెయ్యాలా అనే ప్లానులు వేసుకుంటూ "ఇక రూముకు పోదాం పదండి" అంటూ పైకి లేచాడు హరి.

కీ ఇచ్చిన బొమ్మల్లా ఇసకలోనుండి లేచారు అత్తాకోడళ్ళు.

దారిలో దిగి ఏవో కొనుక్కొచ్చాడు హరి. ఇద్దరు ఆడవాళ్ళు భయపడుతూనే వున్నారు.

అందరికీ ఒకటే రూం. అందులో ఒక డబల్ బెడ్ వుంది. పక్కనే సోఫా వుంది.

"ఒక రూములోనే అందరం సర్దుకోవాలి. తప్పదు. ఇంకో రూమంటే రెండు వేలు అవుతుంది" అన్నాడు.

దుడ్డు ఖర్చు అవుతాది అనగానే ఇద్దరూ నోరెత్తలేదు.

"మీరు పడుకోండి నేను కొంచెం మందు తాగి పడుకుంటా" అన్నాడు హరి బాటిల్ మూత తీస్తూ.

వాసన గుప్పుమంది. చేసేదేముంది. వాడి చేతిలో చిక్కిపోయారు.

రోజంతా ప్రయాణంతో ఊరంతా తిరిగి అలసిపోయి వున్నారేమో. వెంటనే ఇద్దరూ మంచం ఎక్కి నిద్రపోయారు.

నిద్రలో ఏవో పీడకలలు. ఎవరో సుజాతను ఇటువైపు తిప్పుకున్నారు. మంచి నిద్రలో వుందేమో భర్త పక్కన వున్నాడు అనుకుంది సుజాత.

తరవాత అర్థమయింది హరి తన మీద పడ్డాడని. గట్టిగా కేకలు వేసింది సుజాత. అత్త బుజ్జమ్మ లేచి లైట్లు వేసింది.

సుజాత చిగురుటాకులా వణికి పోతోంది. హరి పులిలా సుజాత మీద పడుతున్నాడు.

శక్తినంతా చేతిలోకి తీసుకుని చాచి పెట్టి ఒకటిచ్చింది బుజ్జమ్మ.

ఆగి చెంప తడుముకున్నాడు వాడు.

దెబ్బతో తాగిన మత్తు కాస్త దిగిందేమో "ఏయ్ ముసల్దానా నన్నే కొడతావా. ఏమనుకున్నావ్. మీరిచ్చింది యాభైవేలే. ఇంకో యాభై వేలు నేను పెట్టుకుని దీన్ని కొయేటికి పంపించాల. ఊరికే చేస్తా అనుకున్నావా" కోపంగా అరిచాడు. అసలే కోతి ఆపై కల్లు తాగినట్లుంది వాడి పరిస్థితి.

"బాబూ నీకు దండం పెడతాను. దాన్ని ఏమీ చెయ్యకు. మేము అలాంటి వాళ్ళము కాము. ఏదో కొయేటికి వెళ్ళి నాలుగేళ్ళు కష్టపడి నాలుగు లచ్చలు దుడ్డు సంపాదించుకుని అప్పులు తీర్చుకుందాం అనుకున్నాం తప్ప ఇలాంటి పాపపు పనులు మాకొద్దు" అంటూ చేతులు జోడించింది బుజ్జమ్మ.

"అయితే మీ ఖర్మ. బాగా ఆలోచించుకోండి. నేను దీన్ని పంపించను. మీరు ఇచ్చిన యాభై వేలు కూడా మీకు నష్టమే. నా మాట వింటే మీకు అన్నివిధాలా లాభం. మీ ఇష్టం" అంటూ అటు తిరిగి ధీమాగా పడుకున్నాడు వాడు.

తెల్లారే వరకు ఇదేమి ఖర్మ అనుకుంటూ కంటిమీద కునుకు లేకుండా గడిపారు ఇద్దరూ.

తెల్లారి లేచి "మీ దారిన మీరు పొండి" అంటూ వాళ్ళను వదిలేసి చక్కా పోయాడు హరి.

మద్రాసు పట్టణంలో దిక్కు తోచలేదు ఇద్దరు ఆడోళ్ళకు. ఎప్పుడూ పల్లెటూరు విడిచి బయటికి పోలేదు వాళ్ళు. అసలే అక్కడ తమిళం భాష.

ధైర్యం చేసి ముందుగా తిరపతి బస్ ఎక్కి సాయంత్రానికి కోడూరు చేరుకున్నారు. అష్టకష్టాలు పడి రాత్రికి ఇల్లు చేరుకున్నారు. శివ మొహం చూడాలంటే భయం వేసింది. వచ్చిన వెంటనే పడకలేసుకుని నిద్ర వస్తోందంటూ పడుకున్నారు ఇద్దరూ.

పొద్దున్నే పది గంటలకల్లా కోమటి రామయ్య ఇంటికొచ్చి "నా నాలుగు లచ్చలు వడ్డీతో సహా ఇస్తారా చస్తారా ఏదో ఒకటి చెప్పేదాకా కదలను" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

అప్పుడే ఏజెంటు హరి గూడా వెకిలిగా నవ్వుతూ అక్కడికి వచ్చి "వాళ్ళు ఏం చెప్తారన్నా. చేను స్వంతం చేసుకో సరిపోతుంది" అంటూ నిప్పు ఎగదోసాడు సుజాత వైపు వంకరగా చూస్తూ.

ఇద్దరూ కలిసి నాటకం ఆడుతున్నారని అత్తాకోడళ్ళిద్దరికీ అర్థం అయింది. సమయానికి శివ ఇంట్లో లేడు. లేకపోవడమే మంచిది అనిపించింది.

గంటసేపు ఇద్దరూ ఏదేదో ఇష్టమొచ్చినట్లు వాగి సాయంత్రానికి తేల్చమని చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళు పోగానే గుక్కపెట్టి ఏడ్చింది బుజ్జమ్మ.

దిగులుతో ఆ మధ్యాహ్నం సంగటి ముద్ద కడుపులోకి పోలేదు అత్తా కోడళ్ళిద్దరికీ.

సాయంత్రం కాగానే వచ్చేసాడు కోమటోడు. వచ్చీ రాగానే "అమ్మా నాయనకు చక్కగా పుట్టి వుంటే దుడ్డు కట్టమని" శివను తిట్టడం మొదలు పెట్టాడు.

శివకు దిక్కు తోచలేదు. రోషంగా పైకి లేచి "ఎక్కువ మాట్లాడకు రేపు పొద్దున బాకీలోకి చేను రాసిస్తా పో" అన్నాడు.

బుజ్జమ్మ నెత్తీ నోరూ బాదుకుంది. గుండె పట్టుకుని నొప్పి అంటూ విలవిల్లాడింది. ఆమె పరిస్థితి చూసి శివకు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

మూడు గంటల బస్ లో బుజ్జమ్మను కోడూరు ఆసుపత్రికి తీసకపోయినాడు.

సుజాత చేష్టలుడిగి గుమ్మాన్ని పట్టుకుని కూర్చుండిపోయింది. కాసేపు చలనం లేకుండా పిచ్చిదానిలా కింద కూర్చుంది. తరవాత ఏదో ఆలోచనతో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తల విదిలించి పైకి లేచింది. తలారా స్నానం చేసింది. పెట్టెలో వున్న చీర బయటికి తీసి కట్టుకుంది. గంగమ్మ జాతరలో బలినిచ్చే మేక పిల్ల గుర్తొచ్చివెర్రిగా నవ్వుకుంది. వడివడిగా నడుస్తూ ఏజెంట్ హరి ఇంటికి బయల్దేరింది.

పది రోజులు గడిచిపోయాయి. బుజ్జమ్మ ఆరోగ్యం మెరుగయింది. సుజాత కొయేటికి పోవడానికి శివ వప్పుకున్నాడు. కోమటోడు కువైట్ నుండి వచ్చాకే నాలుగు లచ్చలు దుడ్డు ఇద్దురులే అంటూ ఇంకా ముప్పై వేలు కలిపి ఖర్చులకు ఇచ్చినాడు.

ఏజెంట్ హరి మీలాంటి వాళ్ళను ఎంతమందిని చూసానో అని నవ్వుకుంటూ మీసాలు మెలేసాడు.

సుజాతను స్వయంగా మద్రాసుకు తీసకపోయి కొయేటికి పోయే విమానం ఎక్కించాడు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments